# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 11-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.
- ❖ ప్రతిపక్షాల ఆందోళనల మధ్య పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు పలు మార్లు వాయిదా పడ్డాయి.
- ❖ "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన"తో 50 లక్షలకు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.
- ❖ ఒడిశాలో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.

=======================

`వికసిత్ భారత్`ను నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక వీడియోను పంచుకున్న ప్రధానమంత్రి, దేశంలోని ప్రతి పౌరుడు ఏకతాటిపైకి వచ్చి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. అలాగే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం 'మంగళ్ మిలన్' న్యూఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ఈ ఉదయం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌తో పాటు పలువురు ఎన్డీయే నేతలు పాల్గొని జాతీయ త్రివర్ణ పతాకాన్ని చేతబూని ప్రదర్శించారు.

=======================

నీట్ పరీక్ష అంశంపై విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆరోపణలతో పాటు పలు ఇతర అంశాలపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళన కారణంగా పార్లమెంట్ ఉభయ సభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. లోకసభ ఉదయం 11 గంటలకు సమావేశం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రయత్నించారు. అయితే నీట్ అంశంపై విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన కొనసాగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రాజ్యసభ కూడా ఇదే అంశంపై మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు తొలి వాయిదా అనంతరం సభ తిరిగి సమావేశమైనప్పుడు, చైర్మన్ సి.పీ. రాధాకృష్ణన్ ప్రతిపక్షాల నినాదాల మధ్య ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రయత్నించారు. అయితే నినాదాలు కొనసాగడంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించడం సాధ్యపడలేదు. దీంతో చైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. రాజ్యసభలో బిల్లుకు ఈరోజు ఆమోదం లభించగా లోకసభ ఇప్పటికే ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. రెండోసారి వాయిదా అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు.. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. వివిధ ట్రిబ్యునళ్ల చైర్‌పర్సన్లు, సభ్యుల అర్హతలు, నియామకాలు, సర్వీసు నిబంధనల్లో సామర్థ్యం, స్వతంత్రత, పారదర్శకతను మెరుగుపరచడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ట్రిబ్యునళ్ల వ్యవస్థను పర్యవేక్షించేందుకు నేషనల్ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా బిల్లులో ప్రతిపాదించారు. బిల్లుపై జరిగిన చర్చలో అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2015లోనే ట్రిబ్యునళ్లను హేతుబద్ధీకరించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఆధునిక, స్వతంత్ర, ఏకరూపమైన ట్రిబ్యునల్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026 లక్ష్యమని చెప్పారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థుల నిరసనపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు మాత్రం తప్పించుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. పార్లమెంటు ఆవరణలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై సమాధానం ఇచ్చేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సిద్ధంగా ఉన్నారని, అయితే వారు సభ సజావుగా సాగనివ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

`ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన`తో 50 లక్షలకు పైగా కుటుంబాలకు లబ్ది చేకూరిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. 2024 ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకూ 28 వేల కోట్ల రూపాయలకు పైగా కేంద్ర ఆర్థిక సహాయంగా రాయితీ విడుదల చేసినట్లు మంత్రి ఈరోజు లోకసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ పథకం కింద ఇప్పటివరకు స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థ (DISCOM)తో గ్రిడ్ అనుసంధానిత విద్యుత్ కనెక్షన్ కలిగిన దేశంలోని గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకొని ప్రయోజనం పొందవచ్చని వివరించారు. 2026-27 బడ్జెట్‌లో ఈ పథకం కోసం 22 వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు వెల్లడించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఈ ఏడాది జులై నాటికి 14.65 గిగావాట్లకు పైగా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దేశంలో అదనంగా ఏర్పడిందని మంత్రి

వెల్లడించారు. 2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యానికి ఇది దోహదపడుతుందని ప్రహ్లాద్ జోషి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని భారత్ మరోసారి స్పష్టం చేసింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... సరిహద్దు ప్రాంతాలకు సంబంధించిన అంశాల్లో చైనాతో జరిగే చర్చల్లో భారత్ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యతనిస్తూ వస్తోందని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను కొనసాగించడం దేశానికి అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెకానిజం (WMCC) 36వ సమావేశంలో కూడా ఇదే విషయాన్ని భారత్ పునరుద్ఘాటించిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు నిర్మొహమాటంగా చర్చలు జరిపి, వాస్తవాధీన రేఖ (LAC) వెంబడి పరిస్థితిని సమీక్షించాయని చెప్పారు. LAC వెంబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు.. అపార్థాలు, తప్పుడు అంచనాలు తలెత్తకుండా చూసేందుకు WMCC పని చేస్తుందని రణధీర్ జైస్వాల్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని అంచనా వేసేందుకు, భారత వాతావరణ విభాగం (IMD)తో సమన్వయం చేసుకుంటూ.. మారుతున్న రుతుపవన పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఈరోజు ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ విషయం వెల్లడించారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న 15 రాష్ట్రాల్లోని 342 జిల్లాలకు జిల్లా వ్యవసాయ విపత్తు నిర్వహణ ప్రణాళికలను తాజాగా నవీకరించినట్లు తెలిపారు. ఎల్‌నినో కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు అనుసరించాల్సిన కార్యాచరణ విధానాలను (SOPs) భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ICAR) జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. రిజర్వాయర్లలోని నీటిని గరిష్ఠంగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర జల సంఘం (CWC) రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్లు మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశాలో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో భారత వాతావరణ విభాగం (IMD) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, రాజస్థాన్ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే తరహా వాతావరణ పరిస్థితులు ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, లడఖ్, గిల్గిత్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో నెలకొనే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో గురువారం వరకు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు IMD వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =